# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 05-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సామాజిక న్యాయం, సాధికారత కోసం పోరాటం చేసిన మహానేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అందరికీ స్ఫూర్తి అని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.**

2. **ప్రతి కుటుంబంలో ఒకరు పారిశ్రామిక వేత్తగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**

3. **వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేదలకు 10 లక్షల ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారధి పేర్కొన్నారు.**

4. **మహిళలు, విద్యార్థినుల భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి అన్నారు.**

==========================

సామాజిక న్యాయం, సాధికారత కోసం పోరాటం చేసిన మహానేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అందరికీ స్ఫూర్తి అని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఈరోజు జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్‌తో కలసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. బాబుజీ తొలి మంత్రి వర్గం నుంచి ఎన్నో ఏళ్లు వివిధ శాఖలకు కేంద్ర మంత్రిగా పనిచేశారని పేర్కొంటూ...

...వాయిస్... 33 సెకన్లు....

--------------------------

జగ్జీవన్ రామ్ నడిచిన బాటలో కూటమి ప్రభుత్వం పయనిస్తూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి అనేక సంస్కరణలు తీసుకువస్తుందని కేంద్ర పౌరవిమనయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలో అరసవల్లి కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవాన్ రామ్ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడితో కలిసి ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జగ్జీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... రాష్ట్ర రాజదాని అమరావతిలో 10 కోట్ల రూపాయలతో జగ్జీవన్ రామ్ స్మృతి వనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

---

ప్రతి కుటుంబంలో ఒకరు పారిశ్రామిక వేత్తగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. విజయవాడలోని అమరావతి కన్వెన్షన్ లో నిర్వహించిన సదస్సులో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ వెబ్ సైట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ పరిధిలో 80 వేల సంఘాలు ఉన్నాయని, వీరికి 8 వేల కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లో పిడిలను నియమిస్తామని మంత్రి పేర్కొంటూ...

..వాయిస్... 31 సెకన్లు....

---

వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేదలకు 10 లక్షల ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి నెల్లూరు జిల్లా, గూడూరు మండలం వరిగొండ, పొదలకూరు ఇళ్ళ లేఅవుట్‌లను నిన్న ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 1 లక్షల 50 వేల రూపాయలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు కలిపి మొత్తం 2 లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా అందజేస్తామని చెప్పారు. డ్వాక్రా మహిళా సంఘాలకు అదనంగా రుణ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని మంత్రి తెలిపారు.

---

మహిళలు, విద్యార్థినుల భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. గుంటూరులోని జిల్లా మహిళా ప్రగతి ప్రాంగణంలో 2 కోట్ల 27 లక్షల రూపాయలతో నిర్మించిన సఖి నివాస్‌ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అత్యాధునిక సౌకర్యాలతో తక్కువ రుసుంతో వంద మందికి వసతి కల్పించేలా ఉద్యోగినుల వసతిగృహాన్ని నిర్మించినట్లు తెలిపారు. మహిళలను సామాజిక మాధ్యమాల్లో అగౌరవపర్చినా, కించపర్చినా సహించేది లేదని తెలిపారు.

---

మెగా డిఎస్సికి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని, ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోగలరని అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మెగా డిఎస్సికి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ పొందేందుకు బీసీ, ఈబీసీ కేటగిరీలకు చెందిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాయచోటి లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలన్నారు. ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభ తేదీ తదితర వివరాలు త్వరలో ప్రభుత్వం వెల్లడిస్తోందన్నారు.

---

పేదలకు ఉచితంగా ఆహారాన్ని అందించే సమయంలో దాతలు, స్వచ్ఛంద సంస్థలు తాజాగా ఉన్న ఆహారాన్ని మాత్రమే పంపిణీ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ సూచించారు. దాత ఇచ్చిన ఆహార పదార్థాలు తినడం వలన వారు అతిసారానికి తిరుపతి జిల్లా, చిల్లకూరు మండలం దివిపాలెంలో కొందరు అతిసారం బారిన పడినట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. వెంటనే అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వారికి తగిన చికిత్స అందిస్తున్నారని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రగతి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు అమలు తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిన్న రాజమహేంద్రవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ జైన్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాథమిక పథకాల అమలు తీరుపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు.

---------------------------

సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 16వ తేదీన కళాకారులకు కందుకూరి ప్రతిష్ఠాత్మక, విశిష్ట పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. నాటక రంగంలో కృషి చేసిన వారికి రాష్ట్ర స్థాయిలో కందుకూరి రంగస్థల పురస్కారం, జిల్లాస్థాయిలో కందుకూరి విశిష్ట పురస్కారాలు ప్రదానం చేయనున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

గ్రూప్-2 ప్రధాన పరీక్ష ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ నిన్న ప్రకటించింది. 79వేల 4 వందల 51 మంది పరీక్ష రాయగా, 2వేల 168 అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఏపీపీఎస్సీ కార్యాలయంలో జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు అభ్యర్థులు ఎప్పుడు హాజరు కావాలనే సమాచారాన్ని ఎంపికైన అభ్యర్థులకు వ్యక్తిగతంగా తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్లను మాత్రమే ఏపీపీఎస్సీ ప్రకటించింది.

=====================